**కథ**

# గుండె మాలిని

**రవి సుధను చూచి క్షణకాలం స్థాణువయ్యాడు.**

**ఆమెకు పాతికేళ్ళు. మెళ్ళో సూత్రం లేదు. నల్లపూసల దండ కూడా లేదు.**

**గులాబి రంగు చీర, జాకెట్టు శరీరంతో మేచ్ అయ్యాయి. బంగారు రంగే కాదు, బొమ్మలకుండే అవయవాల పొందిక.**

**ఆ రంగు, ఆ శరీర సౌష్ఠవం, ఆ ముఖ ప్రశాంతత అరుదైన వరాలు.**

హృద్రోగ నిపుణుడు డా.ప్రసాదరావు గది ముందు కుర్చీలో ఆమె కూర్చుని ఉంది. ముఖంలో నవ్వులేదు. దిగులు లేదు. బాధలేదు. అన్నింటినీ దిగమింగే నిర్లిప్తత.

ఆమెను చూస్తుంటే రవికి దిగులు కలిగింది. భగవంతుడు సంపదనిచ్చి, సౌందర్యమిచ్చి, వయసునిచ్చి, చక్కని శరీరమిచ్చి, పొందికైన అవయవాలనిచ్చి, గుండెనెందుకు బలహీనపరచి సర్వం పాడు చేస్తాడో రవికి అర్థం కాలేదు.

ఆమె గుండె ఆపరేషన్ విజయవంతమై, మామూలు మనిషిగా, మళ్ళీ ఈ నేలమీద తిరగాలనీ, తన సౌందర్య కాంతితో చీకట్లు పారద్రోలి ఆనందకాంతులు నింపాలనీ ఆశిస్తున్నాడు రవి.

ఆమెను పలకరించాలనే ఉబలాటంతో ''డాక్టరు రాలేదా!'' అన్నాడు.

''రాలేదు'' అదే నిర్లిప్తత.

రవి మెళ్ళో బంగారు గొలుసులు ఆరున్నాయి. రకరకాల రంగురంగుల రాళ్ళూ రుద్రాక్షలూ ఉన్నాయి. పది ఉంగరాలు. ఖరీదైన బట్టలు, వాచీ, నడక, మనిషి.

సంపద వికృత ప్రదర్శన అసహ్యం కాదా?

డబ్బు ఎండ్రకాయ కొవ్వితే కలుగులో దాగదు. ఏమీలేని ఆకు ఎగిరెగిరి పడుతుంది. అన్ని ఉన్న ఆకు అణిగి మణిగి ఉంటుంది. ఇతడేం లేని ఆకు? సుధ ఆలోచనలో పడింది.

ఇతను డాక్టరుకు మిత్రుడా? విలాస పురుషుడా? సంపన్నులు సహజంగానే మిత్రులా? ఇతనూ డాక్టరేనా? అనుకోసాగింది సుధ.

ఒక వస్తువును ప్రాణిని గూర్చి ఒక మనిషి అనుకొనే మాటలు ఆ మనిషికే పరిమితం కానీ ఆ వస్తువుతో ప్రాణితో చాలా సందర్భాలలో సంబంధం ఉండదు. రజ్జు సర్పభ్రాంతి.

డాక్టరింకా రాలేదు. రోగులొక్కొక్కరే రాసాగారు.

''డాక్టరుకు ఫోను చేశాను. హాస్పటల్లో ఎనిమిదింటికి కలుసుకొందామన్నాడు. ఇంకా రాలేదు. కలిసి చాలా కాలమయింది'' రవి చెప్పాడు.

రోగుల సమయాన్ని మిత్రులు పాడుచేయకూడదు అనుకొంది సుధ. కానీ ఏమీ మాట్లాడలేదు.

ఉన్నట్టుండి ''స్వరూపాన్ని బట్టి స్వభావాన్ని ఊహించవచ్చు'' అన్నాడు. అంటే అర్థం ఏమిటో అతడికే తెలియాలి.

కానీ సుధ ఎందుకో మాట కలిపింది.

''కనిపించే దాన్ని బట్టి, కనిపించని దాన్ని ఊహించటం కష్టం!'' మళ్ళీ మాటల్లేవు.

''డాక్టరుగారి కోసమా?'' అడిగాడు.

''అవును. మీరు?''

''డాక్టరుగారి కోసమే!''

ఉన్నట్టుండి రవి అడిగాడు ''మీ వారు రాలేదా?''

ఆమె మాట్లాడలేదు.

''పిల్లలు?''

ఆమె నోరు కదపలేదు.

''పెళ్ళి కాలేదా?''

జవాబు లేదు.

''అమ్మా నాన్నలు?''

''వృద్ధులు''

పెళ్ళి కాలేదు. తల్లిదండ్రులు వృద్ధులు. కాబట్టి వెంట ఎవరూ రాలేదు. 'పాపం' అనుకొన్నాడు. జాలి కలిగింది. దేవుడామెకు మేలు చేయాలని మనసారా కోరుకొన్నాడు.

రవి వరండాలో అటు ఇటూ తిరుగుతున్నారు. తిరిగే కాలు, తిట్టే నోరు ఊరికే ఉండవు'తిరగనీ' అనుకొంది. వచ్చేవాళ్ళను పోయేవాళ్ళను తీరుబడిగా చూస్తున్నాడు. 'చూడనీ' అనుకొంది. బూట్ల టకటక భరించటం కష్టంగా ఉంది. హాస్పటల్లో ఈ గోల అసహ్యమే! ఇంత అతిశయం పనికి రాదు. ఇది హాస్పిటల్, ప్రశాంతంగా ఉండాలి. సంపన్నుల అహంకారం ఘోరం. రోగుల కష్టం రోగి కాని వాడికి తెలియదు. ఆ తెలివిలేని తనం అతడి నడకలో, నడతలో ఉంది. అతణ్ణి, అతడి తీరును చూస్తుంటే సుధకు చికాకుగా ఉంది.

నిజంగా చికాకు కూడా కాదు. చెప్పలేని భావం.

''మీరొక్కరే వచ్చారేం?'' హార్టు ఆపరేషన్‌కు వచ్చే మనిషి, ఆడమనిషి అయితే, తోడుగా వెంట ఎవరో ఒకరు ఉండాలని రవి అభిప్రాయం.

''ఎవరి తలరాత వాళ్ళది!''

అంటే ఎవరూ లేరేమో! అయినా ఆమెకు ధైర్యం ఎక్కువే! గుండె జబ్బులున్నవాళ్ళకు మొండి ధైర్యం ఉంటుంది కాబోలు.

''డాక్టరు హస్తవాసి గొప్పది. ఏ ఆపరేషనూ ఫెయిల్ కాలేదు''

మిత్రుడి గొప్పతనం చెప్పుకోవటం సహజమేననుకొని సుధ తల ఊపింది.

ఆమె తల వూపటం పరమ సుకుమారంగా ఉంది. సౌందర్యానికి సౌకుమార్యం సహనం ఇస్తే, మంచితనం మధురంగా పరిమళిస్తుంది. ఆమె విశ్వాసమే ఆమె విజయం. ఆపరేషన్ సక్సెస్ అవుతుంది. పెళ్ళవుతుంది.

''అదృష్టవంతుడు'' అన్నాడు.

''ఎవరు?''

''దొరికిన మంచి భర్త!''

''థాంక్స్! అవకాశం లేదు!''

''అంటే?''

''పేదరికం!''

''మీరు పేద కాదు. మీరు కోటీశ్వరులకన్నా సంపన్నులు. మీ సౌందర్యం దేవతల ఆశీర్వాదం. మీవంటి సౌందర్యమూర్తుల్ని నేను ఇంతవరకు చూడలేదు''

రవికి ముప్పై అయిదేళ్ళు. పెళ్ళి కాలేదు. చాలా మంది యువతుల్ని చూశాడు.

''మీకు పెళ్ళి కాలేదు కదా!''

''కాలేదు!''

''అనుకొన్నాను!''

''ఏమని?''

''పెళ్ళి కాలేదనీ, యువతులందరూ అందంగానే కనిపిస్తారనీ- అందం కూడా శాపమే''

''అయ్యో!''

''చూడముచ్చటగా లేకపోతే ఎవరూ చూడరు. అందం అందరికీ ఆనందం కలిగించదు. కొందరికి కొంతకాలమే! అందం అరగదు. జనం అందం పొందలేరు. పొంది భద్రం చేసుకోలేరు. ఛిద్రం చేస్తారు. భగ్నం చేస్తారు. ధ్వంసం చేస్తారు. సౌందర్య సాన్నిహిత్యం సామాన్యులకు ప్రమాదకారి. కురూపి జోలికి ఎవరూ రారు. రూపవంతులకు అన్నీ చిక్కులే! అవస్థలే.''

**ఆచార్య కొలకలూరి ఇనాక్**



రవి బిత్తరపోయాడు. ఆమె ఆలోచన పరిధి, లోతు తెలుస్తున్నాయి. అదామె జీవిత పాఠం అను భవసారం.

''ఏం చదువుకొన్నారు?''

''పదో తరగతి''

''జీవితం చాలా చదివారు. బతుకుబడిలో మీరు పట్టభద్రులు''

సుధ నవ్వింది. ఆమె అరుదుగా నవ్వుతుంది. పెదాలు కదులుతాయి. పలువరుస కనిపించదు. క్షణకాలం పెదాలు కదలవు. అప్పుడామె నవ్వినట్లు గుర్తు.

పరిచయాలు-పేర్లు-ఊర్లు పరస్పరం తెలిశాయి.

డాక్టరు ప్రసాదరావు వచ్చాడు. సుధ లేచి నిలబడింది. రవి ఎదురయ్యాడు. డాక్టరు రవి భుజం మీద చేయి వేసి ''వచ్చారా? సంతోషం. రండి. ఎమర్జెన్సీ కేసు ఒకటి వచ్చింది. వెంటనే అటెండు కావాలి. ఉంటారా? మళ్ళీ కలుద్దాం'' అన్నాడు.

''అలాగ్గే!'' రవి తల వూపాడు.

డాక్టరుతో పాటు సుధ లోనికి వెళ్ళింది. రెండు నిమిషాల్లో ఇద్దరూ వెలుపలికి వచ్చారు. ''మళ్ళీ కలుద్దాం రవీ'' అంటూ వెళ్ళిపోయాడు.

డాక్టరు సుధను పరీక్షించి, ఆరోగ్యం బాగుందని చెప్పి ఉంటాడు. ఆపరేషన్ అవసరం లేదని చెప్పి ఉండవచ్చు. మంచి భర్త, పిల్లలు, సంసారం ఆమెకు దొరకాలి. ఈ అందమైన మనిషికి, ఈ వ్యక్తిత్వానికి, ఈ ఆలోచనలకు, అందమైన భవిష్య

త్తుండాలి అనుకొని, ''డాక్టరు చూశాడా?'' అని అడిగాడు.

''చూస్తాడు!''

మళ్ళీ డాక్టరు వచ్చిందాకా ఆమే ఉంటుంది. తానూ ఉంటాడు. ఆమె అందాన్ని చూస్తూ ఉండ వచ్చు. ఆమె ఇష్టంగా ఉంది. ఈ ఇష్టం కొత్తగా ఉంది.

'రవి వెళ్ళి మళ్ళీ రావచ్చు కదా. ఇంతసేపు ఇక్కడే ఉండటం దేనికి?' అనుకొంది సుధ.

పక్కనే కూర్చుంటూ అడిగాడు. ''మీ నాన్న ఏం చేసేవారు?''

సుధ ఎగాదిగా చూచింది. అది అంత అవస రమా అన్నట్లు చూచింది. అయినా చెప్పింది. ''స్వీపరు-మునిసిపాలిటీలో-రిటైరు అయ్యారు''

## సయీఫ్ అంటే ఇష్టం

**అందాల పోటీల్లో పాల్గొన్నా సినిమా ఛాన్స్‌లు రాకపోతే ఏం చేస్తారు తారలు. పబ్లిక్ ఫంక్షన్స్‌లో పాల్గొని తమ గురించి తామే ప్రచారం చేసుకుంటుం టారు. ఇప్పుడు దయానా హైడెన్ పరిస్థితి అలాగే ఉన్న ట్టుంది. 'కొత్తదనంతో కూడిన సినిమాలు చేసే సయీఫ్ అలీఖాన్ అంటే నాకెంతో ఇష్టం. ఆయనతో కలిసి సినిమా చేయాలని ఉంది. ఇప్పుడు నేను నా అందాన్ని పెంచుకోవడానికి ప్రాధాన్యత ఇస్తున్నాను. సయీఫ్ అందం చూస్తే నాకెంతో ముచ్చటేస్తుంది' అంటోంది దయానా.**

రవి ముఖం మారిపోయింది. ఆటకాయితనం లేదు. అమాయకత్వం లేదు.

మునిసిపాలిటీ పెన్షన్ ఏమాత్రం? ఇల్లు గవ డటం కష్టమే. సుధకు పెళ్ళి కాలేదు. భర్త పోషణ లేదు. ఈమెకు చదువు తక్కువ. ఉద్యోగం ఏదీ రాదు. ఈమె అందం క్రూరంగా శిక్షింపబడు తుంది. పేదరికం కంటే పెద్ద శిక్ష ఏదీ ఉండదు. దానికి తోడు గుండె సమస్య. ఖర్చుతో కూడిన ఆపరేషను.

''మీరు పెళ్ళెందుకు చేసుకోలేదు?''

''ఎవరూ పిల్లను ఇవ్వలేదు. పిల్లలు ఎవరూ ఇష్ట పడలేదు''

''నమ్మను!''

''నిజం!''

ఆమె ముఖంలో జాలి, దయ, సానుభూతి వంటి భావాలు కదిలాయి. అప్పుడామె ముఖం మరింత అందంగా ఉంది.

''మీకేం తక్కువ. వయసు, ఆరోగ్యం, అందం, సంపద, మంచి మనసు..''

ఇంకా చాలా ఉన్నాయి. అన్నీ ఎక్కువే! అవే ఆటంకం.

ఆమె గుండె మునుపటి కంటే వేగంగా కొట్టుకొం టుందేమో అనిపించింది. ఆమె హార్టు పేషెంటు. ఇబ్బంది కలిగించకూడదనుకొన్నాడు.

''మీ అమ్మానాన్నా?'' అడిగింది.

''లేరు!''

''ఇంట్లో తోడుగా''

''పనివాళ్ళు.. డ్రైవరు. గూర్ఖా- వంటవాడు, తోటమాలి, స్వీపరు..సొంతం వాళ్ళు లేరు.''

''అన్నీ ఉన్న దురదృష్టం, ఏమీలేని దురదృష్టం కన్నా ఘోరం!''


తలవూపి, దించుకొన్నాడు.

రవి అహంకారం, అతిశయం మీద కోపం అస హనం కలిగాయి మునుపు. వాటి స్థానంలో జాలీ, సానుభూతి కలుగుతున్నాయి.

ఆంతర్యం దాచుకోవటానికో! ఆత్మను అణుచుకోవటానికో, రవి ప్రయత్నిస్తు న్నాడనిపించింది. ఈ ఆడంబరమైన అలంకారం అందులో భాగం కావచ్చు.

''బంధువులు మిత్రులు?'' సుధ ప్రశ్నించింది.

''వందలు వేలు'' ఆగాడు. ''ఆత్మీ యుల్లేరు!'' నిట్టూర్చాడు.



''ఎవరి జీవితాలు వాళ్ళవి. ఎవరి ఆలోచనలు అవకాశాలు అవసరాలు వాళ్ళవి. ఎవరికెవరు? తమ కోసమైనా తాము బతుకుతూ, నాకోసం కూడా, బతికే వాళ్ళు దొరికితే ఎంత అదృష్టం!''

సుధకు రవి అర్థం కావటం లేదు.

''ఏం చదువుకొన్నారు?'' అడిగింది సుధ.

''చేసే పని లేక చాలా చదివాను. అదొక్కటే ఎంతో ఆనందం కలిగించేది''.

''ఏం చేస్తుంటారు?''

''పూర్వీకుల ఆస్తి ఎలా ఖర్చు చేస్తే ఏడుతరాల కంటే ముందే ఖర్చు అవుతుందా అని చూస్తు న్నాను.''

''చమత్కారంగా మాట్లాడతారే!'' క్షణకాలం పెదాల కదలిక. నవ్వినట్లు గుర్తు.

''మంచి పనులు చేద్దామని ఇష్టం. చేయలేనని చింత. నిరాశ. బలహీనత. బలహీనుణ్ణి.''

''ఎందుకలా అనుకొంటారు'' సుధ నవ్వింది.

ఆ నవ్వు నవ్వుకాదు. ఎగతాళి కాదు. ప్రోత్సాహం. ప్రేరణ. హృదయ స్పందన.

''ధన్యుణ్ణి!''

ఆమె సిగ్గుపడింది. చీకట్లు పోయాయి. ఉషోద యమయింది.

హార్టు ఆపరేషనై, ఆమె చనిపోతే ఇంత సౌందర్యం, ఇంతమంచితనం, ఇంత మానవత్వం, ఇంత నిశ్చల వ్యక్తిత్వం అనంత మృత్యువులో విలీనం కావలసిందేనా?

బై పాస్ సర్జరీ అవసరమై, డబ్బు కావలసి వచ్చి, ఆమె ఇబ్బంది పడకూడదు. ఎంత ఖర్చు అయినా భరించాలి. నిర్ణయించుకొన్నాడు.

''డబ్బు నేనిస్తాను'' అన్నాడు.

''ఎవరికి?''

''మీకే?''

''ఎందుకు?''

''ఆపరేషన్‌కు''

''ఏమాపరేషన్? అయినా నేను మీకు ఏమవు తానని మీరు, మీ డబ్బు, నాకు ఖర్చుచేస్తారు?''

''మీకు కష్టం కలగకూడదని-''

''కష్టాల్లో ఉన్న వాళ్ళెవళ్ళూ మీకు కనిపించ లేదా?''

''ఉండవచ్చు''

''వాళ్ళకు సాయం చేయండి''

''మీరు తటస్థపడ్డారు!''

''నాకు అవసరం లేదు!''

''అంటే?!''

''ఆపరేషన్ అక్కరలేదు''

''అంటే?''

''నేను పేషెంటును కాను!''

''మరి డాక్టరు దగ్గరకు ఎందుకు వచ్చారు?''

''ఉద్యోగం చేయరాదా?''

''ఏం ఉద్యోగం?''

''హెల్పర్!''

''అంటే?''

''రూం పని, వార్డ్ పని, డోర్ పని, ఊడ్చే పని, కడిగేపని, తుడిచే పని-అన్నీ.''

''అంటే?''

''స్వీపరు!''

''మీరా?''

''నేనే!''

''ఇక్కడా?''

''ఆ!''

''పేషెంటు కాదా?''

''కాదు!''

''హార్టు ప్రాబ్లం లేదా?''

''లేదు!''

గుండెలో గుచ్చుకొన్న ముల్లు నెత్తురు రాకుండా పీకిన అనుభూతి. భయం బాధ పోయి సంతోషం మనశ్శాంతి కలిగాయి. నవ్వాడు. అందమైన నవ్వు..అమాయకమైన నవ్వు.

''మీకెందుకింత సంతోషం?''

''మీరు పేషెంటు కాదని తెలిసి. ఇంతసేపు మీరు రోగి అని దిగులుపడ్డాను. దిగులు పోయింది. సంతోషం కలిగింది.''

రవి ఉన్నట్టుండి ''మీ జీతమెంత?'' అన్నాడు

''రెండు వేలు'' అంది.

''అంతేనా?''

''అదే పదివేలు!''

''పదివేలు కాదు. పాతిక వేలిచ్చినా తక్కువే'' నిజానికది సానుభూతే! అయినా సంతోషమే!

రవి మాటల్లో నిజాయితీ, చూపుల్లో చల్లదనం చూచింది. నమ్మింది. ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి. తుడుచుకొంది 'ఆనందం!' అంది.

ఊరికే కూర్చున్న రవి ఆమె చేతుల్ని చూశాడు. పొట్లాలులాగా ఉన్నాయి. నున్నగా బిర్రుగా నిగారింపుగా చూడముచ్చటగా ఉన్నాయి. చేతుల వేళ్ళు పొడుగ్గా అలుపెరుగని వీరుల్లాగా, పదునుపెట్టనక్కరలేని చాకుల్లాగా ఉన్నాయి. చేతుల రంగు-సహజమయింది గోరింటాకు పండినట్లుగా.

అనుకోకుండా చూపులు కాళ్ళవైపు మళ్ళాయి. ఆశ్చర్యపోయాడు. గదులూడ్చి, వరండా తుడిచి, బాత్ రూం కడిగి, తట్టుకొట్టే మనిషి పాదాలు, పగిలి, నెర్రలిచ్చి పుళ్ళయి, పాచిపట్టి సలపరం పుట్టిస్తూ ఉండటం రివాజు. అలాలేవు. ఈమె స్వీపరు కాదనిపించింది.

ఆమె పాదాలు పాలరాళ్లలాగా నున్నగా తెల్లగా ముద్దుగా మల్లెపూల దండలు లాగా ఉన్నాయి. ఈమె శరీర సౌందర్యాన్ని శాసిస్తున్నదేమిటి? వ్యక్తిత్వమా? సౌకుమార్యమా? జాగ్రత్తా? ఆమె అరుదైన స్త్రీ. స్వీపరు దీపం లాగా ఉండగలదా? ఏ శక్తి ఆమెను అంత అందంగా ఉంచగలుగుతూ ఉంది? ఆమెకు అంత శక్తి ఉందా? ఆంతర సౌందర్యముందా? ఈ ఆంతర సౌందర్యం ఆమె వ్యక్తిత్వమేనా? వ్యక్తిత్వ శోభకు ఆధారమేమిటి? సుధలో ప్రకాశించే ప్రాణి ధర్మం రవిని పరవశింపజేసింది. మురికిలో మనిషి మురికి అంటకుండా ఉండటం నిజంగా అద్భుతం.

పేషెంట్లలో ఒకడికి మూడేళ్లు. వాడు ముద్దుగా ఉన్నాడు. పెళ్ళయి ఉంటే ఆమెకు ఈ వయసు కొడుకు ఉండటంలో ఆశ్చర్యం లేదు. సుధలో తల్లి హృదయం స్పందించసాగింది.

తనకు ఈడైనవాళ్ళు తననిష్టపడినా, కట్నం కానుకలు రావని మానుకొన్నారు. రెండో పెళ్ళి వాళ్ళు, పెద్దవాళ్ళు, ముసలివాళ్ళు ఇష్టపడ్డా, తాను ఒప్పుకోలేకపోయింది. పిల్లలు లేరని భార్య ఉన్నా రెండో పెళ్ళికి యువకులు సిద్ధమయినా తాను సిద్ధం కాలేకపోయింది. ఉంచుకొంటామన్నవాళ్ళూ లేకపోలేదు. ఇల్లు, బేంక్ బేలన్సు చూపిస్తూ ఆశపెట్టిన వృద్ధుల్ని ఇష్టపడలేదు. ఇంకా పెళ్ళి కాలేదు. చదువుసంధ్యల్లేని జులాయి సన్నాసులు ఇష్టపడ్డా తానొప్పుకోలేకపోయింది. ప్రాప్తం లేదు.

డాక్టరు ప్రసాదరావు వస్తూ ''కమాన్ రవీ!'' అంటూ లోనికి తీసుకొని పోయాడు. పది నిమిషాలకు బైటికి వచ్చాడు. రాగానే అడిగింది సుధ ''వెళతారా?''

''లేదు. ఉంటాను'' పక్కనే కూర్చున్నాడు.

పేషెంట్సు ఒక్కరొక్కరినే సుధ లోపలికి పంపుతూ ఉంది. అటు వచ్చిన వాళ్ళెవళ్ళూ ఆమెను తేరిపార జూడకుండా, మరోసారి చూడకుండా పోరు.

వెన్నెలలో తడవని వాళ్ళెవరు? ఆమెను చూడటమే ఒక అదృష్టం! ఆనందం! ఆమె చూపు నిరాశకు విరామం. బాధకు విడుదల. ఒక ఆనందరేఖ వరండాలో కదిలి తాకి తరించి పునీతమవుతుంది.

''సుధా! రవి నీకు తెలుసా! చాలామంచి మనిషి. నువ్వంటే చాలా మంచి అభిప్రాయం ఉంది'' అన్నాడు డాక్టరు వెలుపలినుంచి లోపలికి సుధ రాగానే.

సుధ ఇద్దరికీ నమస్కరించింది. రవి ఎదుటికి వచ్చి ''నన్ను ఆశీర్వదించండి'' అంది.

ఊహించని పరిణామం! ఏమని ఆశీర్వదించటం? ''పొడుస్తున్న పొద్దువు నువ్వు! వాలుతున్న పొద్దును నేను! చెరో దిక్కు. తూర్పు పడమరలు. కలవని దిక్కులు'' ఎందుకో అనేశాడు.

''సూర్యుడు రోజా ఉదయిస్తాడు. తూర్పు పడమరలు కలుపుతాడు'' సుధ వెంటనే బదులాడింది.

''ఆశీర్వదించే వయసు లేదు. ఆరోగ్యమూ లేదు'' రవి నసిగాడు.

''మీ ఆరోగ్యానికి తిరుగులేదు'' డాక్టరు భరోసా ఇచ్చాడు.

''నన్ను ఆశీర్వదించండి'' సుధ రవి కాళ్ళు తాకింది.

''మీ అందం వెలుగొందాలి. ఆయుష్షు పెరగాలి. మీ వ్యక్తిత్వం శోభించాలి. నూరేళ్ళు పిల్లా పాపలతో సుఖంగా జీవించండి.''

సుధ లేవలేదు. లేపటానికి రవి సందేహించాడు. తాకాలంటే ఇష్టమే. ధైర్యమే తక్కువ. సుధ సొంతమైన అనుభూతి. సొంతం!

ఆరోగ్యవంతమైన ఆమెను అనారోగ్యవంతుడైన తాను మలినపరచటం ఇష్టం లేదు.

''నువ్వు అదృష్టవంతురాలివైతే, నేనూ అదృష్టవంతుణ్ణి. అప్పుడు నిన్ను తాకుతాను.

నేను దురదృష్టవంతుణ్ణైతే నిన్ను తాకి మలిన పరచలేను.

నిన్ను భగవంతుడు కాపాడతాడు!''

ఆమె అతడి చేతులు పట్టుకొని పైకి లేచింది. నిటారుగా ఎదుట నిలబడింది. 'నిన్ను' అన్నందుకు ఆనందించింది.

రవి తన మెడలో ఉన్న బంగారు గొలుసులన్నీ తీసి ఆమె మెడలో వేశాడు. వేళ్ళకున్న ఉంగరాలన్నీ తీసి ఆమె దోసిట్లో పోశాడు.

ఆమె వణికింది. కానీ కాదనలేదు. పైగా ఇష్టంగా నిలబడింది. సంతోషంగా చూచింది.

''నేను చనిపోతే ఈ సొమ్ములన్నీ నీ సౌందర్యానికి నా బహుమతులు''

ఆమె చేయి పట్టుకొనే ఉన్నాడు.

''ఆపరేషన్ సక్సెస్ అయి నేను బ్రతికితే నువ్వు బ్రతికినంత కాలం, నీకిష్టమయితే, వీటన్నింటిని నువ్వు వేసుకొని, మా యింటిలో, నాకు తోడుగా, నువ్వుండటం చూచే అదృష్టవంతుణ్ణి.''

